క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అభిషేకాలు


అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో ఆదివారం అమ్మవారి కి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రతీ ఆదివారం మాదిరిగానే తెల్ల వారుజామున 4 గంటలకు అభిషేకాలు ప్రారంభించారు. అనంతరం అమ్మవారిని అలంకరించారు. భక్తులు అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ చేశారు.

లాడ్జీల్లో తనిఖీలు


లాడ్జిలో తనిఖీ చేస్తున్న సీఐ జి.ఏ.వి.రమణ, ఎస్ఐ లక్ష్మణరావు

గజపతినగరం: మండల కేంద్రంలోని లాడ్జీల్లో స్థానిక సీఐ జి.ఏ.వి.రమణ ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. లాడ్జీల్లో రికార్డులతో పాటు లాడ్జీల్లో దిగిన వారి ఆధార్ కార్డులను పరిశీలించారు. లాడ్జీల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టామని సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ కె.లక్ష్మణరావు ఉన్నారు.

బొద్దాంలో నేత్రవైద్య శిబిరం


వృద్ధురాలికి నేత్ర పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ సత్యవతి

వేపాడ: మండలంలోని బొద్దాం పంచాయతీ కార్యాలయంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ విజయనగరం వారి సౌజన్యంతో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆప్తాలమిక్ సత్యవతి 60 మందికి నేత్ర పరీక్షలు చేసి, 25 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారని క్యాంపు సమన్వయకర్త అరుణ్‌కుమార్ తెలిపారు. గ్రామపెద్దలు ఎర్రా సన్యాసిరావు, జనపరెడ్డి ఈశ్వరరావు, నర్సింగ్ స్టాఫ్ అమల తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం


వినయ్‌ను సన్మానిస్తున్న స్థానిక సీనియర్ కబడ్డీ క్రీడాకారులు

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు వినయ్‌కుమార్‌ను స్థానిక శ్రీనివాస కాలనీ వా సులు ఆదివారం సన్మానించారు.కోచ్ ఆల్తి సత్తిబాబు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకూ చెన్నై లో ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీలో నిర్వహించనున్న కబడ్డీ పోటీల్లో విజయనగరం జేఎన్‌టీయూ గుర జాడ యూనివర్సిటీ నుంచి వినయ్‌కుమార్ ప్రాతినిధ్యం వహించనున్నాడని చెప్పారు. పట్టణంలోని సీనియర్ కబడ్డీ క్రీడాకారులు బుగత వెంకటేశ్వరరావు, మళ్ల రామకృష్ణ, రేగలబంద చిట్టిబాబు, కె.శ్రీనివాసరావు తదితరులు వినయ్‌కుమార్‌ను అభినందించి, నగదు సహాయం చేశారు.

వైభవంగా పసలమ్మ పండగ


పసలమ్మతల్లి పుట్టవద్దకు మేళాతాళాలతో వెళుతున్న రైతులు

లక్కవరపుకోట: లచ్చింపేట గ్రామంలో పసలమ్మతల్లి పండగను గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మేళాతాళాలతో గ్రామస్తులు అమ్మవారి పుట్ట వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు తమ పశువులను ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారి పుట్ట వద్దకు తీసుకెళ్లి వాటిపై పసుపునీళ్లు చల్లి పూజలు చేశారు. పాడిపంటలు వృద్ధి చెందాలని ఏటా ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

నేడు అత్యవసర సమావేశం

వేపాడ: జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్‌లో సోమవారం మధ్యాహ్నం అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

వంతెనలు లేక ఇక్కట్లు

- గ్రామాల్లో గెడ్డలపై వంతెనలు లేక వర్షాకాలంలో రాకపోకలు బంద్
- వంతెనలు నిర్మించాలని ప్రజల వేడుకోలు


శాశనపల్లి-పెదవేమలి గ్రామాల మధ్య గెడ్డపై వంతెన నిర్మించాల్సిన ప్రాంతం ఇదే


అలమండ- జె.డి.వలస గ్రామాల మధ్య ఉన్న గెడ్డ

జామి: మండలంలోని పలుగ్రామాల మధ్య ఉన్న గెడ్డలు, వాగులపై వంతెనలు, కల్వర్టులు లేకపోవడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా అలమండ- జె.డి.వలస గ్రామాల మధ్య, శాశనపల్లి-పెదవేమలి మధ్య ఉన్న గెడ్డల వల్ల ఆయా గ్రామాల ప్రజలతో పాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలు వర్షాకాలంలో పూర్తిగా గ్రామాలకే పరిమితం కావాల్సి వస్తోంది. వర్షాకాలంలో ఈగ్రామాల మధ్య ఉన్న గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. ఇటీవల భారీవర్షాలు కురిసిన సమయంలోనూ పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. శాశనపల్లి-పెదవేమలి మధ్య గెడ్డపై వంతెన లేకపోవడంతో శాశనపల్లి, పెదవేమలి, శిరిపురం, చంద్రంపేట, మురపాక తదితర గ్రామా ల వారికి ఇక్కట్లు తప్పడం లేదు. శాశనప ల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు పెదవేమలి ఉన్నత పాఠశా లకు వెళ్లాలంటే గెడ్డలో దిగాల్సిందే. గెడ్డ ఉధృతంగా వస్తే ఆరోజు పాఠశాలకు సెలవు పెట్టాల్సిందే. కుటుంబ సభ్యులు పిల్లలను భుజాలకు ఎత్తుకుని గెడ్డ దాటించిన సందర్భాలు వర్షాకాలంలో ఇక్కడ నిత్యకృత్యం. గ్రామాన్ని ఆనుకునే గెడ్డ ఉండడం వల్ల వరద నీరు కూడా గ్రామాన్ని చుట్టుముడుతోంది. అలమండ -జె.డి.వలస గ్రామాల వారి పరిస్థితి అంతే. అలమండ రైతుల పొలాలు గెడ్డకు అవతలివైపు ఉన్నాయి. వరద ఉధృతి ఉన్న స మయంలో వ్యవసాయ పనులకు పొలాలకు వెళ్లేందుకు అవకాశం ఉండడం లేదు.అలాగే అలమండ నుంచి జె.డి.వలస, గొడికొమ్ము, జామి గ్రామానికి వెళ్లేందుకు గెడ్డ మధ్యలో నుంచి ఉన్న రోడ్డే దగ్గర దారి. అయితే గెడ్డ ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పు డు మండల కేంద్రానికి, ఇతర గ్రామాలకు వెళ్లాలంటే వేర్వేరు మార్గాలను వెతుక్కోవాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వేసవిలో ఏ సమస్యా లేకపోయినా వర్షాకాలంలో మాత్రం ఈ మార్గాల్లో రాకపోకలు సాగించడం కత్తిమీద సామేనని అంటున్నారు. తమ ఇబ్బందులను గుర్తించి, గెడ్డలపై వంతెనల నిర్మాణాలకు అధికారులు చొర వ చూపాలని ప్రజలు కోరుతున్నారు.


శాశనపల్లి విద్యార్థులను పెదవేమలిలోని హైస్కూల్‌కు భుజాలపై ఎత్తుకుని గెడ్డదాటిస్తున్న వారి కుటుంబ సభ్యులు (ఫైల్)

ఎదురుచూస్తున్నాం..



అలమండ గెడ్డపై ఎప్పుడు వంతెన నిర్మిస్తారా అని ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. వర్షాకాలంలో రాకపోకలు సాగించేందు ఇబ్బందులు పడుతున్నాం. గ్రామానికి చెందిన రైతుల పొలాలు,కల్లాలు గెడ్డ అవతలివైపు ఉన్నాయి. గెడ్డలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు పొలాలకు కూడా వెళ్లలేకపోతున్నాం.

– బి.బంగారునాయుడు, అలమండ గ్రామం

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామానికి పెదవేమలికి మధ్య ఉన్న గెడ్డపై వంతెన లేకపోవడం వల్ల మాతో పాటు చుట్టు పక్క గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. వర్షాకాలంలో విద్యార్థులు పక్కగ్రామంలోని ఉన్నత పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి. అత్యవసర సమయాల్లో అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి వంతెన నిర్మించాలి.

– బి.వెంకటఅప్పారావు, శాశనపల్లి గ్రామ సర్పంచ్

నివేదికలు పంపించాం

శాశనపల్లి గెడ్డపై వంతెన నిర్మాణానికి నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. ఇక్కడ బ్రిడ్జి నిర్మించేందుకు రూ.6.10 కోట్లు అవుతుందని అంచనా వేశాం. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం. అలమండ-జె.డి.వలస గెడ్డపై వంతెన నిర్మాణ అంశం ఆర్ అండ్‌బీ పరిధిలోకి వస్తుంది.

– స్వామినాయుడు, పంచాయతీరాజ్ డీఈ

సుపథ ప్రతిభా పరీక్షలకు విశేష స్పందన


క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొత్తవలస: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుపథ సంస్థ వ్యవస్థాపకుడు యు.వి.ఎ.ఎన్.రాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సుపథ ప్రతిభా పరీక్షలకు విశేష స్పందన లభించింది. మండలంలో వివిధ పాఠశాలల నుంచి 385 మంది విద్యా ర్థులు హాజరయ్యారు. వారికి పద్య, శ్లోకాలు, వేదాల పఠనం,గేయాలు, వ్యాసరచన, క్విజ్ తదితర అంశాల్లో జూనియర్,సీనియర్ విభాగాల్లో పోటీలు జరిగాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా సుపథ వ్యవస్థాపకుడు మాట్లాడుతూ సుపథ అనగా మంచి మార్గమని, ఇది ఏమతానికి చెందినది కాదన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని అన్నారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా తాగునీటి బోర్లు


కొత్తవలసలో కాటికాపల్లి జంక్షన్ వద్ద బోరు దుస్థితి


అప్పన్నదొరపాలెం అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో పాడైన బోరు


కాటికాపల్లి గ్రామంలోని యాతవీధిలో నిరుపయోగంగా ఉన్న బోరు

కొత్తవలస: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి హ్యాండ్ బోర్లు మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మిగిలాయి. ఏటా మార్చి నుంచి మేనెల వరకు సమ్మర్‌క్రాస్ ప్రోగ్రామ్ నిర్వహించి బోర్లకు మరమ్మతులు చేస్తుంటారు. అయితే ఆ ఏడాది ఎన్నికల ప్రక్రియ సాగడంతో అధికారులు సమ్మర్‌క్రాస్ ప్రోగ్రామ్‌ను తూతూ మంత్రంగా జరిపారు. చాలా గ్రామాల్లో బోర్లకు మరమ్మతులు చేయకపోవ డంతో తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి. కొన్ని చోట్ల బోర్ల ప్లాట్‌ఫామ్‌లు శిథిలమయ్యాయి. రక్షిత మంచినీటి పథకాల ద్వారా నిర్ణీత సమయాల్లోనే తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఆ సమయాల్లో ఇళ్ల వద్ద లేని వారు తాగునీరు, వాడుక కోసం చేతి పంపులను ఆశ్రయిస్తుంటారు. అయితే బోర్లు పాడవడంతో తాగునీటికి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో పాడైన బోర్లకు మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పాత్రికేయుల సంఘ కార్యవర్గం ఎన్నిక


పాత్రికేయుల సంఘ నూతన కార్యవర్గ సభ్యులు

మెరకముడిదాం: స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మండల పాత్రికేయుల సంఘం కార్యవర్గం ఎన్నికను ఆదివారం నిర్వహించారు. కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఎస్.వి.సత్యనారాయణరాజు (సాక్షి), ఉపాధ్యక్షుడిగా మండల ఆదినా రాయణ (ఈనాడు), ప్రధాన కార్యదర్శిగా పల్లి ఉమామహేశ్వరరావు(మెట్రో న్యూస్), జాయింట్ సెక్రటరీగా బూటు శ్రీనివాసరావు(సూర్య), కోశాధికారిగా విజనగిరి శంకరరావు(ఆంధ్రాపవర్), అసోసియేట్ అధ్యక్షుడిగా తాడేల శంకరరావు(ప్రజాశక్తి) ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఆర్.తవిటయ్య (ఆంధ్రప్రభ), విజనగిరి ఆదినారాయణ (విశాలాంధ్ర), పల్ల ఆదినారాయణ(వార్త) ఎన్నికయ్యారు.

నేడు 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం ' ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రెవెన్యూ, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే ప్రజలు వినతిపత్రాలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

అనుమతులు తప్పనిసరి


మాట్లాడుతున్న ఎస్ఐ జయంతి

దత్తిరాజేరు: దీపావళి పండగ నేపథ్యంలో బాణ సంచా విక్రయాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పెదమానాపురం ఎస్ఐ జయంతి చెప్పారు. పెదమానా పురం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బాణ సంచా దుకాణాల నిర్వహణకు అనుమతులు తీసుకోవడంతో పాటు వాటిని ఏప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారో పోలీసులకు తెలియజేయాలని అన్నారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పారిశుద్ధ్య పనులు


కాలువలో పూడిక తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రమణ ఆదివారం పారిశుద్ధ్య పనులు చేయించారు. పారిశుద్ధ్య కార్మికులు అన్ని వీధి కాలువల్లో పూడిక, చెత్తను తొలగించారు.

108లో ప్రసవం


బిడ్డను చూపిస్తున్న ఈఎంటీ మౌనిక

శృంగవరపుకోట: అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పరిధిలో కొత్తూరు గ్రామానికి చెందిన వంతల వనజకు ఆదివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది కొత్తూరు వెళ్లి వనజను అంబులెన్స్‌లో ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకొస్తుండగా మార్గం మధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ జి.మౌనిక, పైలట్ ఎం.ఎస్.ఎస్.మూర్తి పురుడు పోశారు. తల్లి,బిడ్డలను ఎస్.కోట ఆస్పత్రికి చేర్చారు.

పంచాయతీల ఆధ్వర్యంలోనే పనులు చేయాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో మంజూరైన అభివృద్ధి పనులను పంచాయతీల ఆధ్వర్యంలోనే చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్య కర్తలతో ఆదివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అభి వృద్ధి, ఉపాధి హామీ పనులను పంచాయతీ తీర్మానాలు లేకుండా ప్రభుత్వం తమకు నచ్చిన వారితో చేయించాలని చూడడం చట్ట విరుద్ధమన్నారు. గ్రామస్వరాజ్యంలో స్థానిక సంస్థలకు ప్రాధాన్యం ఇచ్చి గ్రామాభివృద్ధికి తగిన ప్రణాళికలతో పనులు చేయా ల్సి ఉండగా, పంచాయతీలో తీర్మానాలు లేకుండా పనులు ప్రారంభించి, వాటిని తమ పచ్చ నేతలకు అప్పగించి, వారికి పప్పు బెల్లాల్లా నిధులు పంచాలని చూడడం సరైన నిర్ణయం కాదన్నారు. గ్రామాల్లో పంచాయతీ పాలక వర్గాలను, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను కించపరచడం ప్రభుత్వానికి తగదన్నారు. దీనిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సామూహికంగా అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రభుత్వం తీరు మారకుంటే ప్రజాపోరాటమే మార్గమన్నారు. జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, సర్పంచ్ కె.వెంకటరావు, ఎంపీటీసీ ఎం.వి.దుర్గాప్రసాద్, నాయకులు వి.రాంబాబు, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల నిరసన


ఎస్.కోటలో నిరసన వ్యక్తం చేస్తున్న 108ఉద్యోగులు


గజపతినగరంలో నిరసన తెలుపుతున్న సిబ్బంది



బొండపల్లిలో నిరసన తెలుపుతున్న సిబ్బంది

శృంగవరపుకోట/బొండపల్లి/గజపతినగరం/: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 108 సిబ్బంది ఆదివారం నల్లబ్యాడ్జీలతో ఎస్.కోట, బొండపల్లి, గజపతినగరంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ 108 సర్వీసు కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. తమ డిమాండ్ నోటీసుపై యాజమాన్యం జరిపిన చర్చల్లో సానుకూల హామీ రాకపోవడంతో నవంబర్ 8 వరకూ నల్లరిబ్బన్లతో విధులకు హాజరవ్వాలని తీర్మానిం చినట్టు చెప్పారు. మూడు నెలల బకాయి వేతనాలతో పాటు ఎరియర్స్ చెల్లించాలని కోరారు. తమ సమస్య లపై ప్రభుత్వం సానుకూలంగా ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని అన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

బొండపల్లి: మండలంలోని ఇద్దరు వ్యక్తులకు సీఎం సహాయ నిధి చెక్కులను రాష్ట్ర చిన్న, మధ్య తరహా,సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల సంబం ధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజయనగరంలోని తన క్యాంపు ఆఫీస్‌లో ఆదివారం అందజేశారు.అనారోగ్యంతో బాధపడుతు న్న మరువాడ గ్రామానికి చెందిన వెల్లుర్తి సత్యం వైద్యం కోసం రూ.2.21లక్షలు, గిట్టుపల్లి గ్రామంలో గులిపల్లి నవ్యకు పుట్టిన నెలలు నిండని బిడ్డ వైద్యఖర్చుల నిమిత్తం రూ.2.28 లక్షలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరయ్యాయి. గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


విద్యార్థి తుపాకుల రవి

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ గ్రూపులో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తుపాకుల రవి జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ ప్రకాష్ రావు పట్నాయక్ ఆదివారం తెలిపారు. చిత్తూరు జిల్లా కాణిపాకంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన రవి ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టులో చోటు సాధించాడని చెప్పారు.

తుది దశకు గోదాముల నిర్మాణం


వేపాడ సమీపంలో రూ.80 లక్షలతో నిర్మిస్తున్న గొడౌన్


జాకేరులో నిర్మిస్తున్న గొడౌన్

వేపాడ: రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు, పీఏసీఎస్‌లు ఎరువులు,విత్తనాలు నిల్వ చేసేందుకు అనువుగా మండలానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022-23 ఆర్థిక సంవత్సరంలో మూడు గోదాములు మంజూరు చేసింది, వీటి నిర్మాణానికి నాబార్డుతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. అప్పటిలోనే పనులు ప్రారంభం కాగా ప్రస్తుతం తుదిదశకు చేరుకున్నాయని వేపాడ మండల వ్యవసాయ పరపతి సంఘం సీఈఓ పి.అప్పారావు తెలిపారు. ప్రభుత్వం సమకూర్చిన స్థలాల్లో వీటిని నిర్మిస్తున్నారు. రూ.40 లక్షలతో బక్కునాయుడుపేట సమీపంలోని మెట్టవద్ద 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణం ఎన్నికలకు ముందే పూర్తయ్యింది. వేపాడ సమీపంలో రూ.80 లక్షలతో 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో , జాకేరులో రూ.40 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్ల నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి.


బక్కునాయుడిపేట సమీపంలో ఎన్నికలకు ముందే పూర్తయిన గోదాం నిర్మాణం